
# ప్రహేసన్ముఖంగా...



వాడ్రేవు చినవీరభద్రుడు

గొప్ప సంగీతం విన్పించిన వెనుక మూగవోయిన వాయిద్యంలా వుంది మా వూరు సంక్రాంతి పండుగ అయిపోయిన తర్వాత. ఇవాళ అంతా తిరుగుప్రయాణం హడావిడిలో వున్నాం. పెద్దన్నయ్య కుటుంబం కనుమనాడే వెళ్ళిపోయింది. చాలాకాలం తర్వాత వచ్చిన పిన్నీ, అక్కా, నేను మాత్రం ఈరోజు కూడా వుండిపోయాం.

ఉదయం శీతాకాలపు గాలుల మధ్య పెరట్లో జామిచెట్టు నీడల్లో పల్చని ఎండ వాల్తున్నప్పుడు మంచం వాల్చుకు కూచున్నాను. అమ్మ వచ్చి కూచొని కష్టం సుఖం చెప్పుకొచ్చింది. నేను ఈమధ్య కొన్నేళ్ళుగా అసలీవూరు రావడమే కుదరడం లేదు. చిన్నప్పుడు చదూకొనే రోజుల్లో ఈ వూరికి దూరమయిన వాణ్ని యివాల్టిదాకా తిరిగి సమీపం కాలేకపోయాను. చదువూ, బాంకు వుద్యోగమూ, సివిల్ సర్వీస్ పరీక్షలూ, యిప్పుడు సెక్రటేరియటూ, నగర జీవితమూ...నా జీవితం తనదైన పంథాలో ముందుకు వెళ్ళిపోయిందేగాని ఈ వూరి దగ్గిర ఆగిపోలేదు.

ఈసారి పండగకి రావడం యాదృచ్ఛికం. కొన్ని ముఖ్యమైన పనులుంటే వచ్చాను. ఒక్కణ్ణే. కుటుంబాన్ని కూడా పండక్కి తీసుకొస్తేబాగుణ్ణని తర్వాత అన్పించింది. ఎక్కడ చూసినా ఈమధ్య జీవితంలో వెల్తి కన్పిస్తోంది. తెలియకుండా నిరాశ ఆవరిస్తోంది. ఇలా చేస్తే బాగుణ్నేమో అన్న సందేహం ఎప్పుడూ పీకుతోంది.

అమ్మ చెప్పే కష్టం సుఖం నాకేమీ ఎక్కడం లేదు. ఎంత కావాలంటే అంత డబ్బు పంపుతున్నాం, యింకా ఈ కష్టాలేమిటి అన్పిస్తుంది నాకు. అమ్మ అంటోంది "మనుషులు కనబడకపోతే ఎలాగరా? నాకు మిమ్మల్ని చూస్తేనే బలం, కనీసం ఏడాదికోసారన్నా రాకపోతే ఎలాగ?" అని. "ఇక్కడికి నేను రాలేను. కావాలంటే మీరే వచ్చేసి నా దగ్గిర వుండిపోండి" అన్నాను. "ఎలా వచ్చేదిరా? యింతకాలం పుట్టి పెరిగిన ఈవూర్ని వదులుకొని." కళ్ళనీళ్ళు పెట్టుకొంది అమ్మ. నాకేమీ కదలిక కలగలేదు సరిగదా ఆ దుఃఖమంతా ఏదో అపరిచిత దృశ్యంలో మల్లే వుంది. ఇక్కడనే కాదు, ఎక్కడయినా ఈమధ్య నా పరిస్థితి అలానే వుంటోంది. వచ్చే రోజునా అంతే. ఎన్నమ్మాశా మారాం పేసింది. "ఆ

వూరు వస్తావ్నావ్నా'' అని. తీసుకు రావచ్చు, సమస్యకాదు, కాని ఎందుకో దాన్ని తీసుకు రాలేక పోయాను.

ఈరోజు వుండిపోయానన్నమాటేగాని బయటకు కూడా వెళ్ళలేదు. అక్క రెండు మూడు సార్లు మాట్లాడదామని ప్రయత్నించి కూడా నన్ను ఎలా కదపాలో తెలియక వెళ్ళిపోయింది. గదిలో సోమరిగా పడుకుని రోజంతా గడిపేసాను. ఏం తోచక కాసేపు పాత పుస్తకాలు, పత్రికలు తిరగేసాను. ఏదో చిత్రమయిన కుతూహలం.

2

సాయంకాలం కప్పెర కప్పెర చీకట్లు పడుతున్నాయి. పిన్ని సాయంకాలమే ప్రయాణమవుతున్నది. అంతా వీధరుగుమీద కూర్చున్నాం. సాయంకాలపు చివరి కిరణాలు అరుగుమీంచి వెనక్కి జారుతున్నాయి. ఇంటిమీద కాశీరత్నం తీగె నిండుగా పూసింది. వీధుల్లో పిల్లలు దొంగాట ఆడుతున్నారు. కేకలు చాలా రిథమిక్‌గా వినిపిస్తున్నాయి. నాన్నగారు మంచం మీద పడుకొన్నారు. చెల్లాయి హరికెన్ లాంతరు వెలిగించి తెచ్చి తలుపువారగా వుంచింది.

మంగళసూత్రాలు కళ్ళకద్దుకొంటున్న పిన్ని భుజం మీద చెయ్యివేసి ''పిన్నీ, ఒక పాట పాడరాదూ, బస్సు వచ్చేలోగా'' అంది అక్క.

పిన్ని పాటలు పాడుతుందా అని ఆశ్చర్యపడబోయి తమాయించుకొన్నాను ఈ విషయం ఎలా మర్చిపోయేనా అని. పిన్ని చిన్నగా నవ్వింది. దీపం వెలుతురు ఆ నవ్వులో పువ్వులు పూసింది. నేను యింకా ఏం పాడగలనే పాపాయి? అదే రోజుల్నాటి మాటో'' అంది.

''ఆరోజులు గుర్తొచ్చేందుకయినా పాడాలి పిన్నీ'' చటుక్కున అన్నానుగానీ నా మాటలు నాకే కొత్తగా వున్నాయి.


పిన్ని ఎక్కువ బతిమాలించుకోలేదు. ఆమె లోపలి లోకాల్లోకి వెళ్ళిపోయిన పాట పంజరం వొదిలిన పిట్టలా బయటకు వచ్చి రెక్కలూపింది.

''కోటి నదులూ ధనుష్కోటిలో నుండగ...''

''పాట పాడుమా కృష్ణ పలుకు తీపి తేనెలొలుక...''

ఆ కంఠం ఆ సాయంకాలపు వాతావరణాన్ని ఒక మాయాజాలంలో బంధించేసింది. ఏదో పురాపురా సౌహృదాలు వెలరేగ ఎప్పటివో పెళ్ళి బృందాల కోలాహలం వినిపించింది. ఒక మార్మిక నైరూప్య చిత్రలేఖనంలా ఆ దృశ్యం కళ్ళకు కట్టింది. ఎక్కువ కదలిపోయింది నేనే. స్పష్టంగా చెప్పలేని ఒక చిత్రమయిన కదలిక నాలో రేకెత్తింది.

అక్క, పిన్ని రాజేశ్వరరావు గురించీ, మల్లీశ్వరి గురించీ మాట్లాడుతున్నారు. అక్క తన చిన్నప్పుడు పిన్ని పాడిన పాటలన్నీ ఒకటొకటే గుర్తుకు తెచ్చుకుంటూ పాడిస్తోంది. ''ఆంధ్రమాతా-పాటపాడు పిన్నీ'' ''అవన్నీ జాతీయ గీతాలు'' అంది పిన్ని. ''అయినా పాడరాదూ'' అడిగాను. ''జాతీయ గీతాలు నీకిష్టమేనా?'' నవ్వుతో తలూపాను.



## లెఖల మాస్టారు

ఠశియన మా లెఖల మాస్టారు
ఏడో తరగతిలో
తొమ్మిదో ఎక్కం
అప్పచెప్పలేదని
మూడుసార్లు కొట్టారు
మా గురువుగారి చేతిలో
ఒకటి రెండుసార్లు మాత్రమే
దెబ్బలు తిన్నవారు లేరు
అందరూ కనీసం
నాలుగైదుసార్లు
తన్నించుకున్నారు
మాస్టారి ప్రియశిష్యుడు
ప్రభుత్వంలో ఆరుమాట్లు
మంత్రయ్యాడు
కానీ
మాస్టారికి
బెస్టు టీచర్ ఎవార్డు
రాలేదు.
వారింకా వున్నారు
ఎయిటీ ప్లస్......
వారి ఆదాయం జీరో మైనస్.

—రాధామనోహరన్

''ఆంధ్రమాతా...అతులిత చరిత...''

ఈసారి ''తానే మారెనా, గుణమ్మే మారెనా...'' నాకు దేవదాసు పాటలు ఒక కాగితం మీద రాసివ్వకూడదూ, మర్చి పోయేను ఆ పాటలన్నీ'' అంది పిన్ని.

''ఎందుకు, కాసెటే పంపిస్తాను'' అంది అక్క. ''అయినా పాటల పుస్తకాలు దొరుకుతాయిలే టౌన్లో'' అని కూడా అంది.

కాసేపు నిశ్శబ్దం. అమ్మ లోపల వంటపనిలో వుంది. ఇప్పట్లో బస్ వచ్చే సూచనలు లేవు. ''బావున్నాయ్రా పాటలు. ఇంక బస్సు రాదు, పొద్దున్నే ప్రయాణం. ఒరే ఎవ్రా అక్కడ, సామాను లోపలకు తెచ్చేయండి'' అనేసి నాన్నగారు వీధిలోకి వెళ్ళిపోయారు.

నాకేమిటో సరదా వచ్చేసింది. పిన్ని వెళ్ళిపోతోందంటే నిమిషాలమీద పుట్టిన బెంగ యిట్టే కరిగిపోయింది. ప్రయాణం ఉదయానికి వాయిదా పడగానే కలిగిన సంతోషం నాకే ఆశ్చర్యంగా వుంది.

రాత్రి దీపం వెలుతుర్లో యింటిల్లిపాదీ నవ్వుల మధ్య ఎప్పటివో ముచ్చట్ల మధ్య భోజనాలు చేశాం కంది పచ్చడి, వుల్లిపాయల పులుసుతో. భోజనాలు కాగానే పిన్నీ, అక్కా, నేనూ మళ్ళీ అరుగు మీద చేరాం. పూర్వం అంతా కలిసి వుండే రోజుల్నాటి ముచ్చట్లు తవ్వి పోసుకున్నారు వాళ్ళు. ఆనక గోరింటాకు పెట్టుకున్నారు. నా చేతిలో పేరు రాసింది అక్క. చల్లని గాలులు వీస్తున్నాయి. మంచు తెరిపి లేకుండా రాల్తోంది. వీధి దీపాలు మంచువానలో వెలుతురు ముద్దల్లా వున్నాయి. గదుల్లో పక్కలు వేస్తోంది అమ్మ. పిన్ని పాటల మధ్యలో హఠాత్తుగా నావైపు తిరిగి ''నీకిష్టమైన పాట పాడుతున్నాను. విను'' అని పాట మొదలు పెట్టింది.

నేను విపరీతంగా ఆశ్చర్యపోయాను. పాట అంతా విన్న తర్వాత ''ఇది నాకిష్టమైన పాటా?'' అనడిగాను. ''అవును, చిన్నప్పుడు మరీమరీ అడిగి పాడించుకొనే వాడివి'' అంది పిన్ని. అసలు అటువంటి పాట వుందనే గుర్తులేదు నాకు. ఇక చిన్నప్పటి ముచ్చట ఏం గుర్తు? ఇక ఆ తర్వాత అదే ధ్యాస. ఎలా మర్చిపోయేను ఆ పాటని? ఇదే ప్రశ్న.

మా కబుర్లు తెమిలేప్పటికి చాలా రాత్రయింది. ఆ ఇద్దరాడవాళ్ళు రెండు సముద్రాలు సంగమించినంత విశాలమైపోయారు. నెమ్మదిగా నిద్రలోకి జారుకున్నాను. ఏవేవో కలలు. ఏవేవో వలయాల్లోంచి ఎక్కడికో పరుగులు తీస్తున్నట్టు. వలయాల మధ్య ఓ బాట, నిశ్చితమైన గమ్యాన్ని చూపిస్తున్నట్టు.

3

నేను మళ్ళీ నా వుద్యోగ జీవితంలో అడుగు పెట్టగానే క్షణం తీరిక లేకుండా పోయింది. ఎలెక్షన్లు. కొత్త నాయకత్వం, కొత్త మంత్రివర్గం అధికారంలోకి రావడం, ఆ హడావిడి, అల్లర్లు కొత్త మంత్రివర్గం వాగ్దానాలు, ఆర్డినెన్సులు, ఆర్డర్లు, ప్రజా సంక్షేమాలు పథకాలు. సెక్రటేరియట్‌కి వూపిరి పీల్చుకోనివ్వనంత పనిభారం.

కొన్ని రోజుల తర్వాత.

ఆఫీసుటైం అవుతోంది. తొందర తొందరగా తయారై బ్రేక్‌ఫాస్ట్ తీసుకొంటున్నాను. ఆమె నిశ్శబ్దంగా వడ్డిస్తోంది. (ఆమెకీ, నాకూ మధ్య మాట్లాడు కోవడానికి ఏమీ కన్పించక చాలా కాలమే అయింది. అంతా యాంత్రికంగా గడిచి పోతూంటుంది. తడుముకోడానికిగాని, హెచ్చరించడానికిగాని అవకాశ మివ్వకుండా అన్నీ అమర్చుతుంది. మా యిద్దరి మధ్యా నిశ్శబ్దంలోనే ఎక్కువ అవగాహన). హఠాత్తుగా నా చెవుల్ని పాత హిందీపాట 'ఛోడ్‌గయే బాలమ్' బర్సాత్ లోది కాబోలు. ''ఈ పాట ఎక్కడ్నుంచి వస్తోంది?'' ఆమె నావంక చూడకుండానే జవాబిచ్చింది. ''రేడియో

సిలోన్‌లోంచి" రేడియో సిలోన్. హుషారొచ్చింది. చిన్నపుడు హాస్టల్లో వుండే రోజుల్లో ఒక ఆదివారం ఉదయం అప్పు అడగడానికి ఓ మాష్టారి యింటికెళ్లాను. మామూలుగా గంభీరంగా, అన్ ఎప్రోచబుల్‌గా వుండే ఆ మాస్టారు చాలా రిలాక్సింగ్‌గా పువ్వుల లుంగీతో వొళ్ళో రేడియో పెట్టుకుని మడత కుర్చీలోవాలి పాటలు వింటున్నాడు. లోపల్నుంచి వంటలు ఘుమఘుమ లాడుతున్నాయి. నేను ఎందుకెళ్ళానో మర్చిపోయేను. "మాష్టారూ, ఈ పాటలు ఏ స్టేషన్లో వస్తాయండీ?" సిలోన్లో"-గుర్తుపెట్టుకొన్నాను. "రోజూ వేటూరాండీ?" "రోజూ తీరికేదిరా? అందుకే ఆదివారం కోసం చూడటం." అప్పట్నుంచీ కోరిక కాని ఎందుచేతనో తీరనేలేదు.

కాళ్ళకు చక్రాలున్నట్లుగా పరిగెత్తే పెద్దమనిషి పాటలు వింటూ కూచోడం చూసి ఆమె ఆశ్చర్య పోయింది. కాని ఆ ఆశ్చర్యాన్ని తొణకనివ్వకుండానే తన పనుల్లో తాను. కొద్దిగా ఆగి "బావున్నాయి కదూ పాటలు" అన్నాను. ఆమె మెల్లగా నవ్వి వూరుకొంది. మరేమి మాట్లడాలో తెలియలేదు. నా ఏకాకితనమూ, నా మౌనమూ కొత్తగా అర్థమవుతోన్న రోజుల్లో ఆమె ముఖాముఖి ప్రశ్నించలేక ఉత్తరం రాసింది. "మీరు ఎందుకు ఎప్పుడూ ఏవో పోగొట్టుకొన్నట్టు అలా పరధ్యానంగా వుంటారు? నా కొరత ఏమయినా వుందా?" అవి. చాలా దీనంగా, ఎపీలింగ్‌గా. నేనేమి జవాబివ్వలేదు (నాకు తెలిస్తేగా). కాని ఆమె ఏమనుకుందో ఏమో నెమ్మదిగా అలవాటు పడిపోయింది.

ముప్ఫయి అయిదేళ్ళ వయసుకే వుద్యోగంలో నేను కూరుకు పోయిన తీరు నా సీనియర్స్‌ని చాలా ఆశ్చర్యపర చింది. దాన్ని డివోషన్ అనే అనుకున్నారంతా. అందు వల్ల చాలా ముఖ్యమయిన బాధ్యతలు, క్లిష్టమైన వ్యవహారాలు నాకే అప్పగించడం మొదలుపెట్టారు. ఆ పెద్ద యంత్రంలో అత్యావశ్యకమైన పనిముట్టుని అయి పోయాను. ఇలా ఎందుకు జరిగింది? ఆ ప్రశ్న వేసుకోవాల్సిన అవసరమే కలగలేదు యింతదాకా.

ఆ వూళ్ళో వున్న మూడు నాలుగు రోజులూ, ఆ జ్ఞాపకాలు నన్ను వొదలకుండా వెన్నాడుతున్నాయి. మంచుపొరల మధ్య విరిసే ప్రభాతాలు చలిగాలుల మధ్య వెగళ్ళు కాగితాలు, రివ్వున ఆకులురాలిపోయే హేమంత వృక్ష పంక్తుల మధ్య సాయం సంధ్యారశ్మిలో తడుస్తూ షికార్లు, ముఖ్యంగా ఆ రాత్రి, ఆ పాటలు.

ఆ పాట ముఖ్యంగా మరీమరీ సమ్మోహ పర్చింది. నేను వాదయిన స్వీయ లోకం నుంచి చాలాకాలం క్రితమే దూరమయిపోయానని ఆ పాటే చెప్తోంది. ఆ పాట ఆధారంగా తిరిగి ఆ లోకంలోకి ప్రయాణం చెయ్యాలి. ఆ మర్నాడు పిన్ని వెళ్ళిపోతూవుంటే అసం కల్పింతంగా కళ్ళు చెమర్చాయి. అక్క అంది "పిన్నీ, నువ్వు పాటలు ఎంత ఫ్రెష్‌గా పాడావో తెలుసునా?" పిన్ని నవ్వి "అదేమిటే పాపాయి, కన్నుల్లో నీరు, గొంతులో గమకం ఎక్కడకు పోతాయి?" అంది.




క్విట్ ఇండియా ఉద్యమం నాటి సంఘటన ఇది—

ముజఫర్‌పూర్‌లో గుమిగూడిన జనం పోలీసులతో హోరాహోరీ పోరాటం సలుపుతూ ముందుకు సాగుతున్నారు. అన్ని పోలీసు స్టేషన్లపై, బ్రిటిష్ కార్యాలయాల పై దాడి జరిపి వాటిపై జాతీయ జండాలను ఎగురవేస్తున్నారు.

ఈ సమూహంలో పులేనా ప్రసాద్ అనే యువకుడు ముందుకు ఉత్సాహంతో నడుస్తున్నాడు. పోలీసులు జాతీయ జండాలు పట్టుకున్న వారిపై కాల్పులు జరిపారు.

ఒకేసారి ఎనిమిది గుండ్లు పులేనా ప్రసాద్ శరీరం నుండి దూసుకు పోయాయి. అయినా అతను చలించలేదు. క్రిందపడి పోలేదు. తొమ్మిదవ గుండు తగులగానే అతను నేలకొరిగాడు.

ఆ సమయంలో అతని భార్య తారామతి అతని ప్రక్కనే వుంది. భర్త శరీరం రక్తంతో నిండి పోయి అతను నేలకొరిగిపోగానే ఆమె తన చీరపైటను చించి అతని తలకు కట్టు కట్టింది. రక్తపు మరకల్ని చీరతో తుడిచివేసింది.

చావు బ్రతుకుల్లో వున్న తన భర్తను అక్కడే వదలివేసి తన అనుచరులతో పతాకాన్ని ఎగురవేయడానికి ముందుకు సాగింది. జాతీయ పతాకంపైకి ఎగిరిన తరువాతనే ఆమె తిరిగి తన భర్త దగ్గరకు వచ్చింది. అప్పటికే తన భర్త తనను విడిచి స్వర్గం చేరుకున్నాడు.

జాతీయోద్యమం ముందు చావు బ్రతుకుల్లో వున్న తన భర్తను విడిచి కర్తవ్యోన్ముఖురాలైన తారామతి, జాతీయోద్యమంలో అసువులు బాసిన పులేనా ప్రసాద్‌ల చరిత్ర భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రకే వన్నెలు తెస్తుంది.

కర్తవ్యపాలనలో భర్త ప్రాణాలను కూడా లెక్క చెయ్యని వీరనారి తారామతి లాంటి వీరవనితల విగ్రహాలు ఎక్కడా ప్రతిష్ఠింపబడలేదు. అసలు అలాంటి ఎందరో త్యాగధనుల పేర్లు చాలామందికి తెలియదు.

—ఎ.పండరినాథ్

"అవును, పరిపక్వత ఎక్కడకు పోతుంది? అందుకే అంతర్వాహిని అన్నారు" అన్నాను. నేను ఆ వూరు నుంచి వచ్చేస్తున్నపుడు చాలా బెంగపడ్డాను. కర్మాగారాలూ, రోడ్లూ, ఆఫీసులూ, జనసందోహం వుండే ఒక విశాల బృహత్ప్రపంచం అసలు స్పృహకి రాలేదు. అమ్మని వదలి వచ్చేస్తుంటే కళ్ళు చెమర్చాయి. వొదులు లాగూ, చెరిగిన క్రాపూ, పలకా, బొమ్మల పుస్తకంతో పొద్దున్నే బడికి వెళ్ళే పసివాడ్నయిపోయాను.

జీవితంలో ఈ పరాయితనం ఎందుకేర్పడుతుంది? అసలు ప్రశ్న ఇదే. జీవితం నానుంచి ఎందుకు తప్పించుకు పోతోంది? ఒకటే సందేహం. అంత యిష్టపడ్డ పాటని ఎలా మర్చిపోయేను?

4

నగరంలో ఒక సాయంకాలం, ఆకాశం మేఘాచ్ఛన్నమై వుంది. ఆఫీసులో కరెంటుపోయింది. గాలిలో కనరాని గడుసు దెయ్యాల్లా చుట్టూ ఆఫీసు ఫైళ్ళు, బీరువాలు, బల్లలు ఆవులిస్తున్నాయి. కూచోవాలనిపించక బయటకు నడిచాను. బయట రోడ్లమీద హడావిడిగా వుంది. నల్లని ఆకాశం నేపథ్యంగా పల్చని రావి ఆకులు మెరుస్తున్నాయి. డ్రైవర్ కారుతియ్యబోయాడు. వద్దని చెప్పి రోడ్డు మీదకు అడుగు పెట్టాను. అంతమంది జనం మోచేతి దూరంలో తొక్కిసలాడుతోంటే వాళ్ల మధ్యనుంచి అవ్యక్తంగా నిశ్చయించుకొన్న గమ్యంవైపు అడుగు వేసాడు. చిన్నతనంలో వూళ్ళో వానాకాలంలో ఏరు పొంగేది. పెద్ద లోతు లేకపోయినా వడి వుండేది. దాన్లోంచి ఎదురుగా నడిచేవాళ్ళం. ఎర్రని వరదనీరు [illegible] వదిపేస్తే కాళ్ళు మాట్టూ లుంగలు [illegible] పోతోంటే ఒక్కొ అడుగూ ముందుకేసేవాళ్ళం. ఇప్పుడలానే [illegible]స్తోంది. సుల్తాను బజారు, [illegible], కోఠీ అలా [illegible] నడిచానో, నగరం మీద [illegible] [illegible]. తిరిగి కరెంటు వచ్చేసరికి [illegible], చార్మినార్ దగ్గర

వున్నాను. చార్మీనార్‌ని చూడగానే పోగొట్టుకున్న పెన్నిధి దొరికిన ఆనందం. ఏదో పెద్ద దిగులు కూడా ఆవరించింది. నేను చార్మినార్‌కే రావాలనుకున్నట్లుగా మనసు ఏమూలో సాక్ష్యమిస్తోంది. చార్మీనార్‌ని చూస్తో అలా ఎంతసేపు వుండిపోయానో తెలీదు. ఆ తుపాను రాత్రి, ఆ చీకట్లో, ఆ పురాతన ఇండోదారసనిక్ కట్టడం ఎదుట వాలోని ఏ వుద్వేగాలు పొంగాయో ఏదుఖాఃలు వుపశమించాయో నాకు తెలీదు. మా వూరి చివర బ్రిటీష్‌వాళ్ళ కాలంలో కట్టిన ఓ గ్రామ చావడి వుండేది. కొన్నాళ్ళు అది మాకు బడి. అప్పట్లో పంతులమ్మగారు మాకు ఎన్నో కథలు చెప్పి పాటలు నేర్పేది. "కాకి ఒకటి నీళ్ళకు కావుకావు మనుచును..." "క్యా పాగల్ హో?" ఎవరో భుజం తట్టిపోతే వులిక్కిపడ్డాను. పాట గట్టిగా పాడుతున్నానా? వెండి సామాను దుకాణాల్లో రద్దీ తగ్గింది. ఒక చిన్న యిరానీ హోటల్లో దూరాను. హోటలువాడు రికార్డర్లో కేసెట్ మార్చాడు. ఏవో హిందీ మ్యాజికల్ హిట్‌లో మెలోడిస్. టీ కోసం వచ్చానా? ఆ కాసెట్ పూర్తయ్యేదాకా అలానే వుండిపోయాను. బిల్లు చెల్లిస్తూ అడిగాను. "ఈ పాటలు ఏ ఫిల్మ్‌లోవి?" వాడు నన్ను అదోలా చూసి 'వుమ్రావ్ జాన్' అన్నాడు. "ఆడుతోందా ఊళ్ళో?" థియేటర్ పేరు చెప్పాడు. చిల్లర జేబులో వేస్తోంటే చేతికి ఏదో విజిటింగ్ కార్డు తగిలింది. తీసి చూశాను. అదొక

హరికిషన్ • హరికిషన్ • హరికిషన్

త్వరలో

జడ్జిమెంట్
జడ్జిమెంట్
జడ్జిమెంట్
జడ్జిమెంట్
జడ్జిమెంట్
జడ్జిమెంట్
జడ్జిమెంట్

హరికిషన్ • హరికిషన్ • హరికిషన్

రచయితగారి చిరునామా. అక్కడికి దగ్గర్లోనే. ఆ రాత్రివేళ వెళ్ళి అతన్ని ఆశ్చర్యపరచాను. నన్ను చూడగానే గుర్తు పట్టాడు. "మీరు! కదూ అన్నాడు. మళ్ళీ వెచ్చటి టీ. కాసేపు నిశ్శబ్దం. "మీకు వేరే పనేమీ లేకపోతే, యిక్కడ ఒక మిత్రుడి యింట్లో ముషాయిరా, వెళ్దామా" అన్నాడు. అంతకన్నానా? తిరిగి చార్మినార్ వైపు. అక్కడ ఒక పాత భవనంలో పై అంతస్థులో కొద్దిమంది మిత్రుల కలయిక. ముగ్గురు నలుగురు యువతులు కూడా. రచయితగారు నన్ను వాళ్ళకు పరిచయం చేశాడు. "నాకు సాహిత్యంతో అట్టే పరిచయం లేదు, ఆసక్తి అంతే" యింగ్లీషులో సంజాయిషీ ఇచ్చాను. వాళ్ళలో ముస్లిం యువతి నల్లని కనురెప్పల్తో నవ్వింది. పక్కన పూల కుండీల్లో రోజాలు వానకి తడుస్తున్నాయి. చినుకుల చప్పుడు దూరంగా వినిస్తోంది. పైన షాండ్లియర్ డిమ్‌గా వెలుగుతోంది. షర్బత్తులు ఖాళీ అవుతున్నాయి. వాళ్ళు కొన్ని ఘజల్సు, ఔత్తరాహ భక్తి కవుల దోహాలు కొన్ని పాడారు. ఫైజ్ అహ్మద్ ఫైజ్ గురించీ, కర్రతైన హైదర్ గురించీ ప్రస్తావించారు. నాకు కొంత అర్థమయింది, కొంత అర్థం కాలేదు. కాని ఆ సన్నివేశంలో నేను వుండటమే ఒక అనుభవం. వింత పరిమళం నన్ను అలముకొంది.. ఇంతలో ఆ ముస్లిం యువతి కన్నుల్లో నీళ్ళు. మిత్ర బృందం కదిలిపోయింది. ఆమె మొగుడు ఈ స్నేహాలు వదులుకోనందుకు ఆమెను మళ్ళీ కొట్టాట్ట. ఆమె దుఃఖగాథతో గాలి బరువెక్కింది. ఒకళ్ళిద్దరు ఆవేశ పడ్డారు. కాని ఆమె శాంతంగా చెప్పుకొచ్చింది. "నిజమే, నాకు చాలా కష్టాలు. కాని మా యింటి ఎదుట ఒక చెప్పులు కుట్టే వాడున్నాడు. అక్కడేమీ బేరాలుండవు. అయినా ఏదో దారం పేనుతూనో, మరొక పని



నిశ్శబ్దంగా మీకోసం పనిచేస్తున్నవి
— సి పి సి ప్రీమియర్ పంపుసెట్లు


సి పి సి ప్రీమియర్ గృహోపయోగ పంపుసెట్లు పని చెయ్యడంలో అధిక పొదుపు చేసేవి, అత్యంత బలిష్ఠమైనవి. ఏళ్ల తరబడి ఇబ్బంది కలిగించని సేవకు హామీ ఇచ్చేవి.

30 ఏళ్లనుండి ప్రీమియర్ పంపుసెట్లను తయారుచేస్తూ వున్న సి పి సి వారిచే ఇవి తయారుచేయబడుతున్నవి.

సి పి సి ప్రీమియర్ గృహోపయోగ పంపుసెట్లు 1/8 హెచ్.పి. నుండి 2 హెచ్.పి. వరకు గల సైజులలో లభ్యం.

సి పి సి ప్రీమియర్ పంపుసెట్లు యీ కంపెనీ బ్రాంచీలలోను, డీలర్ల మూలంగాను, అన్నిచోట్లా లభ్యమౌతున్నవి. పంపుసెట్లు కొన్న తరువాత మీకు అవసరమైన సర్వీను సౌకర్యాలు వారే చేయగలరు.

సిపిసి (పి) లిట్
కోయంబత్తూర్ 641 030



సిపిసి ప్రీమియర్
మీ కుడిచేయి వలె విశ్వసించతగినది

OBM-23 TG

చేస్తూనో పాటలు పాడుకుంటూ వుంటాడు. చుట్టు పక్కల వాళ్ళూ, బీటు కానిస్టేబులూ రోజూ అతనితో గొడవపడతారు. అతని కంఠం అంతగా బాగుండక పోవచ్చు. న్యూసెన్సే కావచ్చు. కాని అది అతనికి ఎంత ముఖ్యమో వాళ్ళకి ఎలా అర్థమవుతుంది? ఆ పాటకోసం అతను మంచి సెంటర్లు అన్నీ వదులుకొని ఆ మూల కొచ్చాడు. పాటలు పాడుకోవడం కోసం పోరాటం చేస్తూనే వుంటాడు. హి యీజ్ మై యిన్‌స్పిరేషన్, వుర్దూకవి రవాన్ అనలేదూ'' అని గజల్ వినిపించింది. కాసేపు సైగల్‌ని విన్నాం. వ్యథిత రాత్రం సైగల్ స్వరంతో మరింత ప్రిదిలిపోయింది. మెట్లుదిగి వస్తూండగా మిత్రుడ్నడిగాను ''ఆ గజల్‌కి అర్థ మేమిటి?'' అని. అతను చెప్పాడు. ''నవ్వాం, ఏడ్చాం, కాని మనకేమి అర్థమయింది ఆనందమంటే ఏమిటో విషాదమంటే ఏమిటో-టెరిఫిక్ కదూ, రియల్లీ టెరిఫిక్. యుహీ జిందగీ ముసీబత్, యుహీ జిందగీ ముసర్రత్...'' వాళ్ళు చివ్వుమంది నాకు. టైం చూశాను. పన్నెండు దాటింది. వర్షం పెద్దదవుతోంది. రిక్షా పట్టుకొని యింటికి. ఈ నగరానికి వచ్చిన యింత కాలానికి ఈ నగరం తన ఆత్మని నాకు చూపించింది. రిక్షావాడు హమ్ చేస్తున్నాడు. చలిగాలి రివ్వున వీస్తోంది. నిర్మానుష్యమూ, విశాలమూ అయిన రాజపథాలు వానకు తడిసిన చోటల్లా మెర్క్యూరీ దీపాలు గుత్తులు గుత్తులుగా కాంతుల్ని పూశాయి. విన్న మెలొడీస్ మధు రంగా వున్నాయి. కాని మధురాతి మధురమైన మెలో డీస్‌ని యింకా వినాల్సి వుంది.

5

ప్రమాప్ జాన్ ఫిల్మ్‌కి ఆమెతో వెళ్దామను కున్నాను కానీ అప్పటికే ఫిల్మ్ వెళ్ళిపోయింది. కాని ఆ రాత్రి విన్న పాటలు స్పష్టంగా నోటికి రాకపోయినా చెవుల్లో మోగుతోనే వున్నాయి. ఒక మధ్యాహ్నం లంచ్ వేళ సీనియర్ సెక్రటరీ ఒకాయన బడ్జెట్ గురించీ, ఇకనమిక్స్ గురించీ దంచేస్తుంటే మధ్యలో అడిగాను ''ప్రమాప్ జాన్ ఫిల్మ్ చూసారా?'' ఆయన నిశ్చేష్టు డయిపోయాడు. నేను అడిగిందేమిటో కూడా ఆయనకు అర్థం కాలేదు. కాని ఫైల్సు సర్దుతూన్న అటెండర్ మాత్రం ''నేను చూశాను సార్'' అన్నాడు.

ఆ సాయంకాలం పబ్లిక్ గార్డెన్స్ ఎదట అతన్ని అడిగాను ''నీ చిన్నతనపు రోజులు ఎలా వుండేవో చెప్పగలవా?'' అని. అతను స్పష్టంగా చెప్పలేక పోయాడు. ఆకలిమధ్య, అసౌకర్యం మధ్య పెరిగిన వ్యక్తి. ''నీకు పాటలంటే ఇష్టమేనా?'' ''బలే అడిగారు సాబ్. మిఠాయి అంటే తియ్యగా వుండేదేనా అని'' అన్నాడు. ఇంకా చెప్పాడు ''నా చిన్నతనంలో మా వూళ్ళో డ్రామాట్రూపు కొన్నేళ్ళపాటు మకాం వేసేరండీ, వాళ్ళలో ఒకామె చాలా బాగా పాటలు పాడేది. కొంత కాలం అయ్యేప్పటికి ఆమె పాటలు పాడకుండా మా వూళ్ళో తెల్లారదనిపించేది, కాని ఓ తెల్లవారుజామున ఆ ట్రూపు మా వూరొదిలి వెళ్ళిపోయారనుకోండి. నాకు రేఖలో ఆవిడే కన్పించింది.'' ''రేఖా ఎవరు?''




ఈ పనికీతడు తగడని
కోపించి యొకండు పంపె గొప్ప రిపోర్టున్
ఆ పైవాడది కాదని
పైపనికి ప్రమోషనిచ్చె భళిరా! పూభా!

*********

చదువుటకు సీట్లు దొరకవు
చదివిన నుద్యోగమేది సమకూరదు, ఈ
చదువులిక శుద్ధ దండుగ చదువులు రద్దైన మేలు
జరుగునో పూభా!

*********

తంతి తపాలా ఛార్జీ
లెంతంతయొ పెరిగినట్టి యీ కాలములో
నింతీ! యేమని వ్రాయుదు
వింతే సంగతులు మనకు నిటుపై పూభా!

*********

బడిలో చదువులుచెప్పిన
బడిపిల్లలు రారు యింటి ప్రయివేట్లకు, రా
బడి తగ్గి బాధయగునని
బడిలో జెప్పటను మానె పంతులు పూభా!

—పూభా

''అబ్బా, రేఖా ఎవరంటారేమిటండీ, ఉమ్రావ్ జాన్‌లో హీరోయిన్, ఆ కళ్ళు, ఆ కళ్ళల్లో...ప్...చెప్ప లేనండీ, చాలా లోతైన కళ్ళు, 'ఖూబ్ సూరత్' ఆ మాటలన్నవాడు మా ఆఫీసులో అటెండర్. చాలా ఎన్వియస్‌గా చూసాను అతన్ని. ''అన్నట్టు యివాళ రవీంద్రభారతిలో ఏదో ప్రోగ్రాం వుందండీ'' ఇద్దరం కలిసే వెళ్ళాం. అనూప్ జలోల్ ఘజల్స్. మా అటెం డర్ చెప్పకపోతే ఆ ఘజల్స్‌లో ఎన్నో అందాలు తెలీక పోయుండేవి. ''మీరు పంకజ్ వుధాస్‌ని విన్నారా? ప్రీతి సాగర్?''

నేను సాయంకాలాలు త్వరగా యింటికి రావడం, ఏవేనా ప్రోగ్రామ్స్‌కి యిద్దరం వెళ్తూండడం, పిల్లల్తో యిష్టంగా దగ్గరగా మాట్లాడటం మా ఆవిడ్ని చాలా ఆనందపెట్టాయి. కాని ఆమె తొందరగా బయట పడదు. ఈ మార్పు తాత్కాలికమో, శాశ్వతమో ఆమె యింకా నిర్ధారించుకోవాలి. మా ఫ్లాట్ అంతా తెల్లకాలర్ల కుటుంబాలు. బహుశ నేనూ అందులో వొకటి కావడం వల్ల వాళ్ళంటే కంటెమ్ప్ట్. ఆ కాలనీలో రానురాను కాంక్రీట్ సంస్కృతి. పొంరాతి వెంకటేశ్వరుడు, శని వారాలు భజన్లూ, నాకు వూపిరాడటం లేదు. ఇదివరకు ఈ దిగులు నిరాకారంగా వుండేది, యిప్పుడలాకాదు, పూర్వాపరాలు తెలుస్తున్నాయి.

ఆగస్టు పదిహేనున ఆఫీసులో హడావిడి. అంతా గవర్నమెంటు వారు రాజ్యాంగంలో నిర్దేశించిన తీరులో పతాకావిష్కరణా వుపన్యాసాలూ అవీను. ఎవరేనా జాతీయ గీతాలు పాడితే ఎంత బాగుణ్నని (నీకు జాతీయ గీతాలు యిష్టమేనా?). ఇంటికొచ్చిన తర్వాత మా పెద్దమ్మాయిని అడిగాడు, ''ఇవాళ బళ్ళో ఏం చేశారు?'' ''మరేమో జెండా ఎగరేసి బిళ్ళలు పంచి పెట్టారు. నాకేమో ప్రైజులు కూడా ఇచ్చారు.'' ''ఎందుకు?'' ''ఎస్సే రైటింగులో ఫస్టు'' ''ఏమిటి రాసావు?'' ''ఏమిటి రాసానబ్బా...మరేమో...మర్చి పోయాను'' ఆమె నన్ను జాలిగా చూసింది. నేను నా చదూకొనే రోజుల్ని గుర్తు తెచ్చుకోబోయాను. ముందురాత్రి బళ్ళో జూలు కత్తిరించడం, జెండాలు అంటించడం, ఉదయం జెండా ఎగరెయ్యడం, పాటలు...ఏంపాటలు చెప్మా? ఆ ''ఎగరాలి, ఎగరాలి స్వాతంత్ర్య జెండా మా ఐక్యజెండా జాతీయ జెండా...''పెద్దగా పాడేసాను ఆ పాట. పిల్లలిద్దరూ ఒకటే గోల, ఆ పాట నేర్చి తీరాలని.

ఆ రాత్రి ఆమెనడిగాడు ''నీ చిన్నతనం ఎల్లా వుండేది?'' ఆమెకి మంచి ఎక్స్‌ప్రెషన్ వుంది. ఎంతో వివరిస్తుందనుకున్నాను. కాని నిశ్శబ్దంగా వూరుకొంది. ''జీవితంలోకెల్లా బాల్యమే మధురమైంది అంటారు కదా! నీకు అలా అన్పించదా?'' అనడిగాను. ఆమె చిరునవ్వి ''నాకు నా జీవితం ఆసాంతం మధురంగానే వుంటుంది'' అంది. ''నేను నమ్మలేను, అందుకు దాఖలాలేమిటి?''. ఆమె కాసేపాగి ''గొప్ప సంతోషానికి దాఖలాలేముంటాయి? కబీరు దోహా ఒకటి నాకు బాగా గుర్తు. భగవంతుడు అన్ని ఆనందాల్ని ఎలా వివరించ గలడు? అది మూగవాడు తిన్న బెల్లం అన్నాడాయన'' అంది. నేను పెళ్ళయి యింతకాలమయిన తర్వాత మొదటిసారిగా ఆమెను చూసినట్లు ఫీలయ్యాను. ఆమె తనని యింతకాలానికి కన్పరచుకొంది. ఆ విషయాన్నే పైకి చెప్పకోవడానికి అహం అడ్డొచ్చి సంభాషణని అక్కడితో తుంచేశాను.

6

ఒకరోజు ఉదయం ఆఫీసుకు వెళ్ళగానే గొప్ప ఆశ్చర్యంగా వొకప్పటి నా క్లాస్‌మేట్ నాకోసం ఎదురు చూస్తున్నాడు. కుశల ప్రశ్నలూ, సంభాషణా అయిన తర్వాత ''ఒక వారం రోజులపాటు సోషల్ స్టడీస్‌లో క్లాసెస్ నిర్వహిస్తున్నాం. అన్ని కోణాల్లోనూ సమకాలీన సమాజాన్ని అధ్యయనం చెయ్యడం. ఒక రోజు ప్రోగ్రాంకి నువ్వు గెస్టుగా రావాలి'' అన్నాడు. అతడు ఈ మధ్యకాలంలో చాలా చదివాడు, ఎదిగాడు, తెలుసుకున్నాడు. అయినా యింకా తృష్ణ, ఇంకా జిజ్ఞాస. అతనితో మాట్లాడిన ఆ కొద్దిసేపట్లోనూ నేనెంతో ఎడ్యుకేట్ అయినాననిపించింది. ''వుద్యోగం, పెళ్ళయి?'' అడిగాను. ''ఉద్యోగమా? పోస్టల్‌లో క్లార్క్‌ని. ఇక

## నేనూ... ఆకాశం!!......

నేనూ ఆకాశం
మొదట్నించీ మేం ఒకటే!
నేనూ రాత్రీ నేనూ పగలూ
నేనూ నక్షత్రం నేనూ కలలూ
బతుకు బడిలో మొదటినించీ నేస్తాలం!!

కళ్ళూ కలలూ కన్నీళ్ళూ కలత్వనులూ కలబోసి
వెన్నెల్లో ఆరేసి
పాలరాతి చల్లదనాన్ని గుండెల్లో పరుచుకుని
ఆశలూ ఆశయాలూ మాలలుకట్టి
చిన్ననాటి నేస్తాల మెళ్ళో వేద్దామని
ఆకాశాన్ని నిచ్చెన పంపమన్నాను!
నక్షత్రాలూ రాత్రీ పగలూ ఇవేవీ అందవాయె మరి!!

నిచ్చెన ఎక్కుతూ... ఎత్తు ఎదిగేకొద్దీ...
అన్నీ దోబూచులాడుతున్నాయి!...
దౌడుతీస్తూ ఆటపట్టిస్తున్నాయి!!
నేనూ ఆకాశం అలాగే మిగిలిపోతున్నాం!!
నా చేతిలో మాలలు అలాగే వాడిపోతున్నాయి!!

—వి.సంపత్కుమారాచార్య

పెళ్ళంటావా?'' అని నవ్వాడు. ''ఏమిటి?'' ''ఏముం టుంది? శోక వియోగ గీతిక'' అనేసి వెళ్ళిపోయాడు.

నేను వెళ్ళిన రోజున వక్త అతనే. మార్క్సిస్ట్ ఎనాల్సిస్. నాకు ఎక్కువ అర్థం కాలేదు. కాని ఎలియ నేషన్ అనే కాన్సెప్ట్ గురించి అతను చెప్పింది సూచన ప్రాయంగా అర్థమయింది. మీటింగ్ అయిపోయాక అడిగాడు ''వైమనస్యం అనేది ఎలా పోతుంది?'' అతను ఒక క్షణం ఆలోచించి ''సామాజికమైన వైమ నస్యం విప్లవం ద్వారానే పరిష్కారమవుతుంది. ఈలోగా ఎవరేనా వ్యక్తి తన జీవితంలోని వైమనస్యం గురించి ప్రశ్నిస్తే అందుకు సమాధానం స్పష్టంగా లేదు. సాధారణంగా వైయక్తికీ వైమనస్యం నుంచి సంగీతమూ, ఇన్‌టాక్సికేటింగ్ మందులూ, ఆశ్రమాలూ విడుదల కలిగిస్తాయి. ఏమంటే వ్యక్తి తనని ఆ సాంగత్యాల్లో కోల్పోతాడు కనుక. అలాకాక తన వ్యక్తిత్వం నిలకడగా వుంటో, ఈ పరాయీకరణ పోవాలంటే, అందరు బహుశా...'' అని ఆపేసి ''సారీ, నేను యింకా ఎంతో తెలుసుకోవాలి, యిప్పుడేమీ చెప్పలేను'' అని సెలవు తీసుకున్నాడు.

ఇంటికి వెళ్ళేసరికి చిన్నమ్మాయి పెద్దగా పాడు తోంది 'అరె భాయ్ జర దేఖ్ ఛలో' అంటూ. నన్ను చూసి ఆపేసింది. నేను విననట్టుగా లోపలికి అడుగు పెట్టి దాని క్లాస్‌బుక్స్ తీసుకు రమ్మన్నాను. అయిన పాఠాల్లో ప్రశ్నలడిగాను. ఎసైన్‌మెంట్స్ చెక్ చేశాను. భారత ప్రధాని ఎవరు? పత్తిలో పొడుగు పింజరకం ఎక్కడ విస్తారంగా పండుతుంది? అని కూడా అడిగాడు. షి యీజ్ వోకే. 'వెరీగుడ్, కీపిటప్' అన్నాను. అది పుస్తకాలు లోపల పడేసి ఎదుట లాన్స్‌లోకి పోయి మళ్ళీ అదేపాట ఎత్తుకుంది.

ఆ రాత్రి ఆమె వొళ్ళో తలపెట్టుకుని ఆమె కన్నుల్లో యీదుతో పిన్ని పాటలు పాడటం, ఆ తర్వాత నాలో వచ్చిన మార్పులు అన్నీ చెప్పి నాకు వొకటే సందేహం, ఆ పాటని నేను ఎందుకు మర్చి పోయేను చెప్పు అని అడిగాను. ''బావుంది, పజిల్స్ విప్పుతూ కూర్చోడమే నాపనా?'' అందామె ముద్దుగా. ''అలా కాదు, నువ్వే చెప్పగలవు. ఇవాళ మా ఫ్రెండ్ గొప్ప ప్రసంగం చేశాడు. ఎలియనేషన్ అంటూ తీరా చేసి ఎలా దాన్నించి తప్పించుకోవడమంటే తనకే తెలీదు పొమ్మ న్నాడు. నాకు వీటన్నిటికీ ఒకటే జవాబు కన్పిస్తోంది చెప్పవూ'' అన్నాను. ఆమె నవ్వి ''పుటుక్కు-జరజర డుబుక్కు-మే'' అంది. వొకటే నవ్వు యిద్దరం. 'నా తండ్రీ ఎందుకు మనకా చర్చలు? ఎలియనేషన్ యిదిగో యిట్లా పోతుంది'' అంటూ మెత్తగా కావిలించు కొంది.

## 7

ఆ పాట యిన్నాళ్ళయినా నన్ను ఛాయలా వదల్లేదు. ఆ ఛాయ తనతో తెచ్చిన ప్రకాశం నెమ్మదిగా నన్ను వెలిగించింది. ఆ పాట యిప్పుడు గుర్తొస్తుంటే, అందులో వాక్యాలొక్కటే కాదు, నా బాల్యమంతా గుర్తొస్తోంది. ఎర్రని బోగన్‌విల్లియాలు పూసిన పెళ్ళి పందిట్లో గ్రాంఫోను పెట్టి పాటలు మొదటిసారి వినడం, తోలుబొమ్మలాటవాడు చేసే చప్పుళ్ళు, పండగ రోజుల్లో తాళాలు మోగిస్తో గంగిరెద్దులవాళ్ళు చేసే రాగాలు, యింటిలో చిన్నపుడు బంధువర్గమంతా కలిసి చెప్పుకొన్న కబుర్లు, నానబెట్టిన ధాన్యాన్ని మంగలంలో వేయించి రోట్లో పోస్తే ఆడవాళ్లు పాటలు పాడుతూ అటుకులు దంచడం, అమ్మవారి తిరునాళ్లలో బూరాలు కొనుక్కొని పీ-పీ అని వూదడం- ఇవన్నీ గుర్తొస్తున్నాయి. ఆ పాటలు నా జీవితం నుంచి ప్రత్యేకమైన అస్తిత్వం లేనంతగా అయిక్యమైపోయింది. అప్పటి అనుభవాల్ని మినహాయించి ఆ పాట నాకు ఎప్పటికీ గుర్తుకు రాదు.

ఒక సాయంకాలం అటెండరు గోడవారగా కూర్చొని బీడీ దమ్ములాగుతూ ఒక పుస్తకం పఠిస్తోంటే దగ్గరకు వెళ్ళిచూశాను. దేవదాసు పాటల పుస్తకం. ''ఇది నా కిచ్చెయ్యవా?'' (యీ క్రూర ఆఫీసరుకి యీ గారా లేమిటి?) ''మీ కెందుకు సాబ్ యిది, అయినా మీరు అడిగితే కాదంటానా?'' అని తటపటాయించి ''సాబ్, ఏమీ అనుకోపోతే ఒక్కమాట'' ''ఏమిటి?'' ''ఈ మధ్య మీలో చాలా మార్పు కన్పిస్తోందండీ'' వులిక్కి పడ్డాను. ''మార్పా? మంచి మార్పా? చెడ్డ మార్పా?'' వాడు పళ్ళికిలించాడు ''హేపీ సార్, హేపీ'' అన్నాడు. చెప్పొద్దూ, అంతగొప్ప ప్రశంస నా జీవితంలో అంతదాకా నేను అందుకోనే లేదు.

## 8

నాలుగయిదు నెలలు గడిచాయి. నాలో ఆలోచనలన్నీ అక్కయ్యకు ఉత్తరంరాసి, పిన్నిని చూడాలని వుంది, నేరుగా అక్కడికే రమ్మనమని కబురు చేశాను. నేనూ, మా ఆవిడా, పిల్లలూ కలిసి వెళ్ళాం పిన్నీ వాళ్ళ వూరు. ఆ పల్లెటూరు నా చిన్నపుడు ఎలా వుందో యిప్పుడూ అలానే వుంది. మా చిన్నాన్న అక్కడ వ్యవసాయం. చాలా విషాదకరంగా అనిపించింది వాళ్ళ యింటి పరిస్థితి చూస్తే. చిన్నాన్న తన జీవితంలో ప్రయోజకుడిగా ముద్ర పడలేకపోయాడు. ఆ తాటాకుల యిల్లు లోగిలి కాకుండానే అతను ముసలివాడయిపోతున్నాడు. కొడుకు అక్కడే పోస్టుమాస్టరు చేస్తున్నాడు. ఇద్దరు ఆడపిల్లలకు యింకా పెళ్ళిళ్ళు కావాల్సి వుంది. ఆ ఇంటిలో పేదరికం తాటాకు యిరుకు ప్రస్ఫుటంగా కన్పిస్తోంది. నిజానికి ఒక్కసారిగా యింతమంది అతిథుల్ని వాళ్ళు భరించ గలరా అన్నది కూడా సందేహమే.

అయితే యివన్నీ నా ఆలోచనలే. అక్కనీ, నన్ను, మా కుటుంబాన్నీ చూసి వాళ్ళు పొంగిపోయారు. ఏవేవో కబుర్లు ఎడతెరపి లేకుండా. ఆమె నన్ను వొదిలేసి ఆ పొగమారిన వొంటింట్లో 'అత్తయ్యగారూ' అంటూ పిన్నితో కబుర్లాడుతూ కూరలు తరిగింది. అక్క పిన్ని కోడల్తో కబుర్లు చెప్తోంది. నేను వంటింటి గడప దగ్గర పీట వాల్చుకొని ''పిన్నీ-నీకు దేవదాసు పాటల పుస్తకం తెచ్చాను. యిదిగో'' అన్నాను. ఆ పుస్తకం చూసి ఆమె ముఖం చాటంత అవుతుందని ఆశపడ్డాను. కాని ఆమె 'మా నాయనే, ఎంత గుర్తుపెట్టుకున్నావు నీ యాతనలో వుండి కూడా' అని మాత్రం వూరుకొంది. అక్కడ పిన్నిని చూసి నేను చాలా నిస్పృహ చెందాను ఎడతెగని యింటి చాకిరీకి. పేదరికపు యిరుకుకి ఆమె చిక్కి శల్యమైంది. నేను భయపడ్డట్లే మా పెద్దమ్మాయి నన్ను రహస్యంగా అడిగింది ''యీపిన్ని నిజంగా పాటలు పాడుతుందా నాన్నా'' అని.

ఆ స్త్రీలూ, ఆ ఆడపిల్లలూ వాళ్ళ గోష్ఠుల్లో ఏవీ పాటలు పాడలేదు. కాని ఎడతెరిపి లేకుండా కబుర్లు చెప్పుకొన్నారు. మధ్యలో ఏ కారణాలు పురస్కరించు కునో కన్నీళ్ళు, వోదార్పులు. ఒకళ్ళకొకళ్ళు జడలల్లు కున్నారు. వీరెం గురించి, నగల గురించీ సోరారా చెప్పుకున్నారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున పూత రేకులు చుట్టారు. సాయంకాలం చుక్కలు వెలిగే ఆకాశం కింద మంచాలు వాల్చుకొని సన్నజాజులు మాలలు గుచ్చు కొంటూ రహస్యమైన పులకరింతల్తో పరవశం చెందారు.

నేను శూన్యంగా, సోమరిగా పెరట్లో చంద్రకాంత పువ్వుల్ని చూస్తో నిల్చున్నాను. వెనుక నుంచి పిన్ని మనవడు ఏడేళ్ళవాడు అంటున్నాడు: ''మరేమో, చిన్నాన్నా, నేనూ శంకరాభరణం పాటలు పాడతాను, వినవూ...యీసారి వొచ్చేటప్పుడు ఆ పాటల పుస్తకం తేవూ...

మా ఆవిడ మెత్తగా నా బుజంమీద చెయ్యివేసి, ఏమిన అనుభూతి.

********************